క్లుప్తంగా

దసరా సంబరాలు ప్రారంభం



మహిషాసురమర్ధిని వేషంలో విద్యార్థులు

సీతానగరం: చెడుపై మంచి సాధించిన విజయానికి విద్యార్థుల సృజనాత్మకత దృశ్యంగా నిలుస్తుంది. రావణ సంహారం, దుర్గాదేవి మహిషాసుర సంహారం దసరాసంబరాలను పురస్కరించుకుని బక్కుపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం హెచ్ఎం గౌరీశ్వరరావు, కృష్ణదాసు ఉపాధ్యాయులు విద్యార్థులతో దసరా సంబరాలు నిర్వహించారు.

141మంది రోగులకు వైద్యపరీక్షలు



గలావల్లి పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

బలిజిపేట: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గలావల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారిణి రేవతి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 141మంది రోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళలు, గర్భిణులు, బాలింతలు, కిశోరీ బాలికలకు రక్త పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు, ఇతరత్రా వ్యాధి సంబంధిత పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోరీబాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల వైద్యాధికారులు నీహారిక, స్నిగ్ధ, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

సహజంగా పండించిన కూరగాయల్లో పోషక విలువలు



సహజంగా పండించే కూరగాయలతో వచ్చే పోషక విలువలను చిన్నారులకు తెలియజేస్తున్న అంగన్వాడీ కార్యకర్త

పార్వతీపురం రూరల్: సహజంగా పండించే కూరగాయలు, ఆకు కూరల్లో సహజమైన పోషక విలువలు ఉంటాయని 8వ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా మండలంలోని సంగంవలస గ్రామంలో గల అంగన్వాడీ–2 కేంద్రంలో సీడీపీఓ రేఖావాణి ఆదేశాలతో చిన్నారుకు, వారి తల్లిదండ్రులకు అంగన్వాడీ కేంద్రంలో ప్రభుత్వం ద్వారా ఇస్తున్న పోషక పదార్థాలు, సహజంగా పండించిన కూరగాయలు తినడం వల్ల వచ్చే ప్రయోజనాలు వంటివాటిపై అంగన్వాడీ కార్యకర్త బడే సునీత వివరించారు. ఈ మేరకు గర్భిణులు, బాలింతలు ప్రధానంగా ఇలాంటి సహజంగా పండించే కూరగాయలు తినడం ఉపయోకరమని తెలిపారు.

ఏరియా ఆస్పత్రి వద్ద నేడు వైద్యశిబిరం

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వద్ద శనివారం మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి తెలిపారు. స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా జిల్లా లోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభ మవుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సత్తాచాటిన పూర్వ విద్యార్థి



రామకృష్ణను సన్మానిస్తున్న నర్సిపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2020–21 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన పాతిన రాకృష్ణ ఈఏడాది నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించి ఆంధ్రామెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో రామకృష్ణను ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఆరు నుంచి పదవ తరగతి వరకు తమ పాఠశాలలో చదువుకుని ప్రఖ్యాత ఆంధ్రా మెడికల్ కళాశాలలో సీటు పొందడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో రామకృష్ణ తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు బి.సత్యనారాయణ, ఎస్.బాలకృష్ణ, వెంకటనాయుడు, బీవీ ఆర్‌కే ఎం.నాయుడు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీకా ఓ రక్ష

- గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా వ్యాక్సిన్
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి

బలిజిపేట: వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధుల బెడద ఎక్కువగా ఉంటుంది. వాటి రక్షణకు ముందస్తుగా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం టీకాలు వేయించాలి. ఈ కాలంలో పశువులకు ఎక్కువగా గాలికుంటు వ్యాధి వచ్చే ఆస్కారం ఉంది. ఈ వ్యాధి పికార్నవైరస్ వల్ల వస్తుంది. ఈ వ్యాధి కలిగించే వైరస్‌లో ఓఏసీ, ఆసియా1, సాట్1, పాట్2, సాట్3 వంటి రకాలు ఉన్నాయి. సాధారణంగా ఈ వ్యాధి పశువుల్లో జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో వస్తుంది. గాలిద్వారా ఇది వ్యాపిస్తుంది. దేశవాళీ పశువుల కంటే సంకరజాతి పశువులకు ఎక్కువగా నష్టం కలిగిస్తుంది. గాలి కుంటు వ్యాధి బారిన పడిన తల్లిపాలు తాగిన వెంటనే దూడలు మరణిస్తాయి. గేదెలు, ఆవులు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గ్రామాల్లో ఉన్న ప్రతి పశువుకు ఉచితంగా టీకా వేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని వచ్చేనెల 15వ తేదీ వరకు నిర్వహిస్తారు. పాడిరైతులకు ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కల్పించారు. జీవాలకు వ్యాపించే వ్యాధులపై ప్రతి రైతు అప్రమత్తంగా ఉంటూ వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని చెబుతున్నారు.



గాలికుంటు వ్యాధి సోకిన దూడ డెక్కలు

గాలికుంటు వ్యాధి సోకేది ఇలా

వాతావరణ మార్పులతో కలుషితమైన గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. తల్లి పాలద్వారా దూడలకు వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. ఏటా వర్షాకాలంలో ఆవులు, గేదెలకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. ఈ వ్యాధి గిట్టలు ఉన్న ప్రతి జీవికి సోకుతుంది. వ్యాధి సోకినప్పుడు పశువుకు 104 నుంచి 105డిగ్రీల జ్వరం వస్తుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు వచ్చి పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వ్యాధి సోకిన పశువులు మేత తీసుకోలేక నీరసించిపోతాయి.

నివారణ మార్గాలు

వ్యాధి సోకిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేయాలి. నోటిలో ఉన్న పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు మందు ద్రావణంతో శుభ్రం చేసి ఈగలు వాలకుండా వేపనూనె రాయాలి. యాంటిబయాటిక్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది.



ఆవు నాలికపై సోకిన గాలికుంటు వ్యాధి

టీకాలు తప్పనిసరి

వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణకు పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలి. కొందరు రైతులు పాడి దిగుబడి తగ్గిపోతుందని టీకాలు వేయించడానికి వెనుకడుగు వేస్తారు. టీకాలు వేయించడం వల్ల పాల దిగుబడి తగ్గిపోతుందనేది అపోహ మాత్రమే. వ్యాధి ముదిరి పశువులు మృతి చెంది నష్టపోవడం కన్నా ముందస్తు టీకాలు వేయిస్తే నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు. మండలంలో తెల్ల పశువులు 15,500, గేదెలు 820, దూడలు 1,600ఉన్నాయి. వాటికి టీకాలు వేసేందుకు మండల పశుసంవర్థకశాఖ చర్యలు చేపడుతోంది.



నారన్నాయుడువలసలో టీకాలు వేస్తున్న వైద్యాధికారి గణేష్

అన్నింటికీ టీకాలు వేస్తాం

మండలంలోని పశువులు అన్నింటికి టీకాలు వేయనున్నాం. ప్రతి గ్రామంలో శిబిరాలు ఏర్పాటుచేసి టీకాలు వేస్తున్నాం. లక్ష్యాన్ని పూర్తిచేస్తాం. రైతులు వారి పశువులను శిబిరం వద్దకు తీసుకువచ్చి టీకాలు వేయించుకోవాలి.

– గణేష్, మండల పశువైద్యాధికారి, బలిజిపేట

వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శిగా వెంకటరమణ



మాజీ ఎమ్మెల్యే జోగారావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎస్సీ సెల్ అనుబంధ విభాగాల నాయకులు, నర్సిపురం పార్టీ శ్రేణులు

పార్వతీపురం రూరల్: రాష్ట్రంలో పేద, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ఆత్మగౌరవంతో బతకాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తెచ్చుకుని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకోవాలని ఈ మేరకు ఎస్సీ సామాజిక వర్గాలంతా పాటు పడాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శిగా మండలంలోని నర్సిపురానికి చెందిన బి.వెంకటరమణను నియమించిన సందర్భంగా నర్సిపురం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యే జోగారావును ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ నా ఎస్సీ, నా బీసీ, అంటూ తన కుటుంబసభ్యులుగా భావిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్లీ చేసేలా గ్రామాల్లో ఎస్సీ అనుబంధ విభాగాల నాయకులు పర్యటించి ప్రజలకు గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ చైతన్య పరచాలని సూచించారు. అలాగే చెరుకుబిల్లి గంగరాజును పార్వతీపురం మండల ఎస్సీసెల్ విభాగ అధ్యక్షుడిగా నియమించిన మేరకు జోగారావుకు ఆయనకు కూడా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నర్సిపురం గ్రామ సర్పంచ్ బంగారమ్మ, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ప్రభావతి, చేనేత విభాగం అధ్యక్షుడు పిచ్చుక శేషు, సీనియర్ నాయకులు గురురాజు, తెర్లి రామస్వామి, శెట్టి వెంకటరమణ, సంజీవినాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మాదక ద్రవ్యాలు, బాల్యవివాహాలు నిర్మూలించాలి

బలిజిపేట: మాదక ద్రవ్యాలు, బాల్యవివాహాల నిర్మూలనకు అందరం పాటుపడాలని మై చాయిస్ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ క్రాంతి తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని సుభద్ర, బలిజిపేట ఉన్నత పాఠశాలలో వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై ఎలాంటి లైంగిక వేధింపులు జరిగినా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి బాధితులను సంరక్షించాలని కోరారు. బాల్య వివాహాలు జరగకుండా అందరం కలిసి వాటిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలు, యుక్త వయస్సులో ఉండే అమ్మాయిలపై ఎటువంటి అఘాయిత్యాలు జరిగినా టోల్ ఫ్రీ నంబర్ 18004198588కు ఫోన్ చేసి వెంటనే తెలియచేయాలని సూచించారు.



సుభద్ర గ్రామంలో మాట్లాడుతున్న మై చాయిస్ ఫౌండేషన్ ప్రతినిధి క్రాంతి

బలిజిపేట సీడీపీఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పోషక ఆహారాలపై అవగాహన కల్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను మోసం చేసిన ప్రభుత్వం

బలిజిపేట: ప్రతి ఒక్క ఆటో, క్యాబ్ డ్రైవర్‌కు వాహన మిత్ర పథకాన్ని అమలు చేస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఆగ్రహించారు. ఆటో డ్రైవర్లు అందరికీ వాహన మిత్ర అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, కరెంట్ చార్జీలు, ఆటో మెయింటనెన్స్ చార్జీల దృష్ట్యా ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేలాది రూపాయలు జరిమానాలు విధించే జీవో నంబర్ 21ని రద్దు చేయాలని, రోడ్డు టాక్స్, ఫిట్‌నెస్ చార్జీలు, పెనాల్టీలు రద్దు చేయాలని కోరారు. వాహన మిత్ర పథకం అమలులో పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లు, నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించిన ఆటో, క్యాబ్ డ్రైవర్లు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్, వెంకంపేట 11కేవీ ఫీడర్లపై విద్యుత్ సరఫరా జరుగుతున్న నర్సిపురం, వైకేఎం పంచాయతీ భాగం అఫీషియల్ కాలనీ, 40 అడుగుల రోడ్డు, వసుంధర నగర్ ప్రాంతాలకు శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు గ్రామీణ ప్రాంత విద్యుత్‌శాఖ ఏఈ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న కారణంగా పైన తెలిపిన ప్రాంతాల్లో గల వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ లైన్లకు పెట్రోలింగ్

సీతానగరం: మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించే లైన్లకు సిబ్బంది సహకారంతో పెట్రోలింగ్ జరిగిందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ పి.శశిభూషణరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని అప్పయ్యపేట, బూర్జ సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఫీడర్లకు జరిగిన పెట్రోలింగ్ పనులతో పాటు మరమ్మతులు చేయడాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడడం వల్ల వినియోగదారులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా తక్షణమే పెట్రోలింగ్ చేయాలని సంకల్పించామన్నారు. ఈ మేరకు సిబ్బందితో బూర్జ, అప్పయ్యపేట సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న 8 ఫీడర్లకు పెట్రోలింగ్ సంయుక్తంగా చేపట్టామని తెలిపారు. అలాగే మరమ్మతుల బారిన పడిన ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేశామని చెప్పారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, సహాయకులు పాల్గొన్నారు.



మండలకేంద్రంలో విద్యుత్‌లైన్‌పై ఉన్న కొమ్మలను నరుకుతున్న సిబ్బంది

ఆకట్టుకున్న బ్రహ్మకమలాలు



గురువారం రాత్రి 9గంటలసమయంలో వీరబూసిన బ్రహ్మకమలాలు

సీతానగరం: మండల కేంద్రంలో గూడెం వీధికి చెందిన ఆర్వీ పార్థసారథి ఇంట్లో బ్రహ్మకమలాలు విరబూశాయి. మూడేళ్లుగా బ్రహ్మ కమలం మొక్కను ఇంట్లో పెంచుతున్నానని ఏడాదికి రెండు సార్లు బ్రహ్మకమలాలు పూస్తున్నాయని పార్థసారథి తెలియజేశారు. అత్యంత శీతల ప్రాంతాల్లో పూస్తున్న బ్రహ్మకమలాలు పార్థసారథి ఇంట్లో దాదాపు 9 వరకూ గురువారం రాత్రి పూయడంతో స్థానికులు చూసేందుకు వస్తున్నారు.

శిథిలావస్థకు చేరితే కానీ టిడ్కో ఇళ్లు ఇవ్వరా?

పార్వతీపురం రూరల్: టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు కాల పరిమితి సమీపించి శిథిలావస్థకు చేరితే గానీ ఇళ్లను లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం ఇచ్చేలా కనిపించడం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని అడ్డాపుశీల గ్రామం వద్ద ఉన్న టిడ్కో గృహాల భవన సముదాయాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన ఎనిమిదేళ్లుగా టిడ్కో ఇళ్లకోసం ఆశగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నిర్మాణాలు పూర్తయినప్పటికీ కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు అప్పగించడంలో విఫలమైందన్నారు. పార్వతీపురానికి 1104, సాలూరుకు 1440 మంజూరు చేసిన టిడ్కో గృహాలను తక్షణమే సంబంధిత లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంగల దాలినాయుడు, కిరణ్ కుమార్, గౌరీశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో గృహాల వద్ద కాంగ్రెస్ నాయకులు

స్వస్థ్ నారీ సశక్తి పరివార్ ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నివారణ



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్స్ రమ్య సాయి, జయశ్రీ

సీతానగరం: స్వస్థ్‌నారీ సశక్తి పరివార్ పథకం ద్వారా చేపడుతున్న ఉచిత వైద్యశిబిరాలను రోగులు వినియోగించుకోవాలని పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ పి రమ్యసాయి అన్నారు. ఈ మేరకు మండలంలోని బూర్జ ప్రభుత్వ ఆయుష్ డాక్టర్ టి.హేమాక్షి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత విధానం ద్వారా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్స్ రమ్యసాయి, హేమాక్షిలు మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రోగులకు ఆయుర్వేద, హోమియో, యునాని, నేచురోపతి విధానం ద్వారా వైద్యసేవలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తున్నట్లు తెలియజేశారు.

శిబిరంలో రక్తపరీక్షలు, ఎన్‌సీడీ, కేన్సర్ స్క్రీనింగ్, ఏఎన్‌సీ, పీఎన్‌సీ, క్షయవ్యాధి, నేత్రాలకు పరీక్షలు నిర్వహించామన్నారు. పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్, నేచురోపతి డాక్టర్ జయశ్రీ, హోమియోడాక్టర్లు సుశీల, వర్మ, ఆయుష్ డాక్టర్ మహేష్ ఉచితవైద్య సేవలందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ఆయాలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట కాలువ పరిశీలన

మక్కువ: ఓపైపు యూరియా కరువు, మరోవైపు పంటపొలాలకు సాగునీరు కరువుతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు అన్నారు. ఈ మేరకు మండలంలోని తూరుమామిడి గ్రామం సమీపంలోని 19ఎల్ కాలువను సీపీఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ ద్వారా మక్కువ, బొబ్బిలి, సీతానగరం మండలాలకు చెందిన 24,700ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, కేవలం 16వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందన్నారు. ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఈ ఏడాది కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పంట పొలాలకు నీరు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. ఆర్‌బీసీ పరిధిలో గల 19ఎల్ కాలువలో పిచ్చిమొక్కలు పేరుకు పోవడంతో, సాగునీరు సరఫరా కాక సుమారు 1000ఎకరాలకు సక్రమంగా నీరు అందడం లేదన్నారు. వీఆర్ఎస్ ప్రాజెక్ట్ చైర్మన్ సొంత గ్రామానికి చెందిన పంటపొలాలకే నీరు అందకపోతే, మిగిలిన గ్రామాల పంటపొలాల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రాజెక్ట్ పరిధిలో మరమ్మత్తులు జరిపించేందుకు రూ.65లక్షలు మంజూరైనప్పటికీ, ఆ నిధులు ఖర్చు చేశారా? ఖర్చుచేస్తే శివారు గ్రామాలకు సాగునీరు ఎందుకు అందడం లేదో తెలపాలని డిమాండ్ చేశారు. ఆర్ఎంసీ పరిధిలో సాగునీరు సక్రమంగా అందకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు.



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సాలూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ అన్నారు. స్వచ్ఛోత్సవ్ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సాలూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మున్సిపల్ హైస్కూల్ వద్ద విద్యార్థులకు ఈ కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. స్వచ్ఛోత్సవ్ స్వచ్ఛత హి సేవ కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. పాఠశాల పరిసరాల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకులకు కిట్లు అందజేత



నిర్వాహకులకు కిట్లు అందజేస్తున్న ఏపీఓ మురళీధర్

పార్వతీపురం: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా బార్‌ట్రానిక్స్ పంపిణీ మొబైల్ ఆధార్ క్యాంప్‌ల నిర్వహణ, ప్రజల ఆధార్ నమోదు, సవరణ, బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు సులభతరంగా నిర్వహించే నిమిత్తం ఐటీడీఏ ఏపీఓ మురళీధర్ శుక్రవారం నిర్వాహకులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో ఆధార్ సేవలు ప్రతి పల్లెకు చేరేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో కొంతమంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

పార్వతీపురం టౌన్: ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, లేబర్ హాలీడేస్ అమలు చేయాలని, ఏపీఎస్ ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం ఆర్టిసి డిపో వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయని కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. టెండర్లలో పేర్కొన్న వేతనాలు కూడా కార్మికులకు అందకుండా కోతలు విధిస్తున్నారని విమర్శించారు. పార్వతీపురం డిపో పరిధిలో అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలపై ఆందోళనలు చేసినప్పటికీ ఆ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించలేదని వాపోయారు. ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించాలని జిల్లా ప్రజా రవాణా అధికారితో చర్చలు జరిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బంది సమస్యలపై డీపీటీఓ వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్